సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 6 । నవంబర్ । 2024

బోనమో.. పోచమ్మ



వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ బద్దిపోచమ్మ అలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. సోమవారం రాజన్నను దర్శించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు సమర్పించేందుకు క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను రాజన్న ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు.

పిల్లలేం చూస్తున్నారో?



- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు

నేటి పిల్లలు, యువత సెల్‌ఫోన్ మైకంలో ఉంటున్నారు. క్షణం తీరిక లేకుండా తిండి, నిద్ర మానేసి, అందులోనే లీనమవుతున్నారు. ఫోన్, కంప్యూటర్ వాడేవారు ఇంటర్‌నెట్‌లోకి వెళ్లగానే ఏదో ఒక రూపంలో అశ్లీలం పలకరిస్తుంది. పొరపాటున దాన్ని క్లిక్ చేస్తే ఆ తర్వాత అన్నీ అలాంటి దృశ్యాలే పదేపదే వస్తుంటాయి. విద్యార్థులు, ముఖ్యంగా యువత ఇలాంటి సైట్లు చూడటం మొదలుపెడితే అది అలవాటుగా మారి, చివరికి వ్యసనమవుతుంది. గంటల తరబడి సోషల్ మీడియాలో ఉంటున్న పలువురు అనర్థాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 71 సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఫోన్, కంప్యూటర్‌లో ఏం చూస్తున్నారో నిఘా ఉంచాలి. అవసరం తీరగానే వాటిని తీసుకోవాలి. - 8లో



న్యూస్‌రీల్

కొనుగోళ్లలో వేగం పెంచాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఖీమ్యానాయక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో సజావుగానే ధాన్యం సేకరిస్తోందన్నారు. రైతులు దళారులకు విక్రయించి నష్టపోవద్దని కోరారు. ఎక్కడికక్కడ అధికారులు కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. కొనుగోళ్ల విషయంలో కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తహసీల్దార్ రామచంద్రం, ఏఎంసీ వైస్‌చైర్మన్ గుండాడి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి నర్సయ్య, సద్ది లక్ష్మారెడ్డి, బండారి బాల్‌రెడ్డి, షేక్‌గౌస్ ఉన్నారు.

జిల్లా మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమేశ్, తదితరులు

ఇల్లంతకుంట: ప్రజాసమస్యలపై సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందని జిల్లా కార్యదర్శి మాశం రమేశ్ అన్నారు. ఈనెల 19, 20వ తేదీల్లో జిల్లాలో జరిగే పార్టీ మహాసభల పోస్టర్‌ను మంగళవారం ఇల్లంతకుంటలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు హాజరుకావాలని కోరారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గన్నారం నర్సయ్య, నాయకులు సావనపల్లి రాములు, మంద అనిల్ కుమార్, సామ నర్సింహారెడ్డి, ప్రభాకర్, రవి ఉన్నారు.

సప్లిమెంటరీ బిల్లు చెల్లించాలి



సభ్యత్వ నమోదులో దొంతుల శ్రీహరి

ఇల్లంతకుంట: జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నెలలతరబడి పేరుకుపోయిన సప్లిమెంటరీ బిల్లులను వెంటనే చెల్లించాలని జిల్లా డీటీఎఫ్ అధ్యక్షుడు దొంతుల శ్రీహరి కోరారు. మంగళవారం ఇల్లంతకుంట, గాలిపల్లి, పొత్తూరు, దాచారం, రేపాక, తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. మండల అధ్యక్షుడు టి.నరేందర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆర్.రామేశ్వర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్లు మధు, కృష్ణారెడ్డి, అశోకరెడ్డి, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఎంఆర్‌లో 26 టీఎంసీలు



బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం 26.89 టీఎంసీలకు చేరింది. ఎస్సారెస్పీ నుంచి 190క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిషన్‌భగీరథకు 40 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

20న సదరం శిబిరం

సిరిసిల్లటౌన్: జిల్లా ఆసుపత్రిలో ఈనెల 20 నుంచి 22 వరకు సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీనారాయణ మంగళవారం తెలిపారు. ఆర్థో బుధవారం, మానసిక గురువారం, కంటిచూపు, వినికిడి శుక్రవారాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు మాత్రమే శిబిరానికి రావాలన్నారు. మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్‌-రే, ఫోన్ నంబర్లు వెంట తీసుకుని ఉదయం 10గంటలకు శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

వైద్య కళాశాలలో ప్రొఫెసర్ల నియామకం

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ఆరుగురు ప్రొఫెసర్లను మంగళవారం నియమించారు. కలెక్టరేట్‌లో వైద్యుల నియామకం కోసం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అధ్యక్షతన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ భైరి లక్ష్మీనారాయణ వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆచార్యులు-1, సహాయ ఆచార్యులు-1, సహాయ ఆచార్యులు-2, సీనియర్ రెసిడెంట్లు-2ను ఎంపిక చేశారు. వారికి కలెక్టర్, ప్రిన్సిపాల్ నియామకపత్రాలు అందించి, త్వరగా విధుల్లో చేరాలని ఆదేశించారు.

మిల్లులు.. రైతులకు కన్నీళ్లు

- కాలుష్య నిలయాలుగా రైస్‌మిల్లులు
- పాడవుతున్న పంట భూములు
- పడిపోతున్న దిగుబడులు
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి ఫోకస్



వేములవాడరూరల్ మండలం మల్లారంలోని గురుకుల స్కూల్ వద్ద ఉన్న రైస్‌మిల్లు ఉన్న ప్రాంతం ఇదీ. రైస్‌మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలతో కంపు వాసన వస్తోందని గురుకుల విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీ చేశారు. తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి అలాగే ఉంది. ఆ రైస్‌మిల్లు చెరువు శిఖం భూమిలో ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.



ఎల్లారెడ్డిపేట మండలం దుమాల శివారులోని రైస్‌మిల్లు చుట్టుపక్కల ఉన్న పంట పొలాల్లోని దుస్థితి ఇదీ. సదరు రైస్‌మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలు పంటపొలాలపై చేరడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. దిగుబడి సగానికి పైగా పడిపోతుందని రైస్‌మిల్లు చుట్టుపక్కల పొలాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితి జిల్లావ్యాప్తంగా ఉన్న 13 మండల కేంద్రాల శివారులోని రైస్‌మిల్లుల వద్ద ఉంది.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల):

జిల్లాలోని రైస్‌మిల్లులు కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. పంట పొలాల మధ్య ఏర్పాటు చేసిన రైస్‌మిల్లుల నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు నేరుగా పొలాల్లో చేరుతుండడంతో భూములు సారవంతం కోల్పోతున్నాయి. పంటలు ఎదగడం లేదు. ఫలితంగా దిగుబడి సగానికి పైగా పడిపోతోంది. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, పదిర, గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, గంభీరావుపేట శివారు, తంగళ్లపల్లి, వేములవాడరూరల్, బోయినపల్లి మండలాల్లోని రైస్‌మిల్లులు పంట పొలాల మధ్యనే ఏర్పాటు చేశారు. వీటి నుంచి వచ్చే దుమ్ము, ధూళి, బూడిద, ఊక, తవుడు పొట్టు పంటలపై చేరడంతో మొక్కలు ఎదగడం లేదు. ఫలితంగా అన్నదాతలకు పంట దిగుబడి పడిపోతోంది. ఇటీవల దుమాల శివారులోని రైస్‌మిల్లు నుంచి వస్తున్న దుమ్ముధూళితో బాధపడుతున్న రైతులు ఆందోళన చేయడంతో రైస్‌మిల్లుల కాలుష్యం విషయం వెలుగుచూసింది.

పడిపోతున్న దిగుబడి

రేగడి భూములు పత్తిసాగుకు అనుకూలం. జిల్లాలోని రేగడి భూముల్లో ఎకరంలో 15క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. రైస్‌మిల్లులు ఉన్న ప్రాంతాల్లోని పొలాల్లో దిగుబడి 5 క్వింటాళ్లకే పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైస్‌మిల్లుల నుంచి వచ్చే దుమ్ము, ధూళితో ఈ ఏడాది పూత, కాత తగ్గిపోయింది. ఎకరానికి 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

తహసీల్దార్ తనిఖీ

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట శివారులోని రైస్‌మిల్లు నుంచి వస్తున్న కాలుష్య కారకాలతో తమ పంటలు పాడవుతున్నాయని రైతులు దుమాలకు చెందిన గుళ్లపల్లి లక్ష్మారెడ్డి, నిమ్మల సత్తవ్వ, నిమ్మల రాజయ్య, నిమ్మల రాములు, నిమ్మల లచ్చయ్య, నిమ్మల బాబు తదితరులు ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ రామచంద్రంకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైస్‌మిల్లు నుంచి వ్యర్థాలు బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా వారిని హెచ్చరించారు.

దిగుబడి పడిపోయింది



రైస్‌మిల్లు ఏర్పాటు చేయకముందు నాకున్న 2.20 ఎకరాల్లో దాదాపు 35క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. రైస్‌మిల్లు పెట్టిన తర్వాత సగానికి పడిపోయింది. మిల్లు నుంచి వస్తున్న వ్యర్థాలపై పత్తి మొక్కలపై పేరుకుపోయి ఎదుగుదల లేకుండా పోయింది. ఫలితంగా గతేడాది 12 క్వింటాళ్లు రాగా, ఈ ఏడాది 5 క్వింటాళ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు.

– నిమ్మల బాబు, దుమాల

పరిహారం చెల్లించాలి



రైస్‌మిల్లుల నుంచి వచ్చే దుమ్ముధూళితో పంట పొలాలు దెబ్బతింటున్నాయి. పత్తి పంటను సాగుచేసి కుటుంబాలను పోషించుకుంటున్న మాకు దిగుబడి రాక అప్పులపాలవుతున్నాం. రైస్‌మిల్లర్లు రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి. దెబ్బతిన్న పంటలను అధికారులు పరిశీలించి, రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి.

– గుల్లపల్లి లక్ష్మారెడ్డి, దుమాల

పనిష్మెంట్ నుంచి ప్రమోషన్

- మౌఖికాదేశాలిచ్చిన చొప్పదండి ఎమ్మెల్యే
- పాటించిన డీఈవో
- ఇదేమి తీరంటున్న ఉద్యోగులు



వీర్నపల్లి ఎస్‌వో బదిలీ ఉత్తర్వులు



బోయినపల్లి ఎస్‌వోగా పోస్టింగ్ ఉత్తర్వులు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ పక్షం రోజుల క్రితం పనిష్మెంట్ కింద బదిలీ వేటు వేసిన ఉద్యోగిని మళ్లీ పదోన్నతితో అదేహోదాలోకి తీసుకొని విద్యాశాఖ వివాదంలో చిక్కుకుంది. వీర్నపల్లి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషలాఫీసర్‌గా పనిచేసే ఉద్యోగి నిర్లక్ష్యంతో ఓ విద్యార్థి గోడదూకి గాయాలపాలైందని డీఈవో ఆమెను బదిలీ చేశారు. రుద్రంగి కేజీబీవీలో సీఆర్టీగా విధులు నిర్వర్తించాలని గతనెలలో ఉత్తర్వులు జారీచేశారు. పక్షం రోజులు గడవక ముందే తిరిగి బోయినపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ గత నెల 29న ఉత్తర్వులు ఇచ్చారు. బోయినపల్లి ఎస్‌వోగా పని చేస్తున్న ఉద్యోగిని వీర్నపల్లి కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. చొప్పదండి ఎమ్మెల్యే మౌఖిక ఆదేశాల మేరకు వీర్నపల్లిలో పనిష్మెంట్‌కు గురైన ఎస్‌వోను బోయిన్‌పల్లి ఎస్‌వోగా తీసుకున్నట్లు ఈనెల 1వ తేదీన జిల్లా విద్యాశాఖ వెల్లడించిన ఉత్తర్వుల్లో ఉండడం గమనార్హం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పారని పోస్టింగ్ ఇవ్వడంపై తోటి ఉద్యోగులు మండిపడుతున్నారు. విద్యాశాఖలో రాజకీయ ప్రమేయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు.

మహిళా సభ్యులకు బీమా వర్తింపు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: అర్హులైన మహిళా సంఘాల సభ్యులకు బీమా, ప్రమాదబీమాను ప్రభుత్వం కల్పించిందని స్త్రీనిధి జోనల్ మేనేజర్ శ్రీలత అన్నారు. మంగళవారం రాజరాజేశ్వరి జిల్లా సమాఖ్య సమావేశంలో బీమా వర్తింపుపై సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. బీమాలో ఉన్న నియమ, నిబంధనలు, సెటిల్మెంట్ ప్రక్రియ పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డీఆర్‌డీవో శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, స్త్రీనిధి ఆర్‌ఎం రాంనారాయణ పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌వోల నియామకం



లావుడ్య శ్రీకాంత్, చందుర్తి ఎస్సై



ప్రశాంత్ రెడ్డి, కోనరావుపేట ఎస్సై

సిరిసిల్లక్రైం: జిల్లాలోని కోనరావుపేట, చందుర్తి పోలీస్‌స్టేషన్లకు ఎట్టకేలకు ఎస్సైలు వచ్చారు. ఈ మేరకు మంగళవారం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కోనరావుపేట ఎస్సైగా ప్రశాంత్‌రెడ్డి, చందుర్తి ఎస్సైగా లావుడ్య శ్రీకాంత్ విధుల్లో చేరనున్నారు. ఈ రెండు పోలీస్ స్టేషన్లకు ఎస్‌హెచ్‌వోలు లేరంటూ 'ఈ ఠాణాలకు ఏమైంది' శీర్షికన ఈనెల 4న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందిస్తూ.. 48 గంటల్లో స్టేషన్ అధికారులను కేటాయిస్తూ పోలీస్‌శాఖ నిర్ణయం తీసుకుంది.

అంబులెన్స్ సర్వీసుల్లో ఉద్యోగాలు

సిరిసిల్లటౌన్: అంబులెన్స్‌ల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా 108 మేనేజర్ వెల్దండి రాము తెలిపారు. బీఎస్సీ, బీజడ్సీ, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, నర్సింగ్ బీఫార్మసీ, ఎంఫార్మసీ ఉత్తీర్ణులై, 25ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 7 గురువారం ఉదయం 10 గంటలకు తంగళ్లపల్లిలోని గ్రామపంచాయతీ ఆఫీసులో ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు జిరాక్సు సెట్‌తో హాజరు కావాలన్నారు. వివరాలకు 9000356108 నంబరును సంప్రదించాలన్నారు.

మామిడిపల్లి ఆలయాభివృద్ధికి కృషి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



మామిడిపల్లి ఆలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్

కోనరావుపేట/రుద్రంగి(వేములవాడ): కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి వార్లను మంగళవారం దర్శించుకున్నారు. బండి సంజయ్‌కి ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. సన్మానించి స్వామివారి ప్రసాదం అందించారు. సంజయ్ మాట్లాడుతూ పురాతన మామిడిపల్లి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం కోనరావుపేటలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. మల్కపేటలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. మామిడిపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని, మామిడిపల్లి- బండపల్లి రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. కోనరావుపేటలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. మరిమడ్లలో మినీ బస్టాండ్, హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. మల్కపేటలో మున్నూరుకాపు సంఘ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అంతకుముందు రుద్రంగిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సంజయ్ ప్రారంభించారు. రుద్రంగి బస్‌స్టాండ్ ఆవరణ కూరగాయల మార్కెట్, పబ్లిక్ టాయిలెట్లకు శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లను ప్రారంభించారు. శ్రీ లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. సంజయ్ వెంట చెన్నమనేని వికాస్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాపరామకృష్ణ, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్, పడాల గణేశ్, బోయిని రాజు, గోపాడి సురేందర్‌రావు, అల్లాడి రమేశ్, ఎర్రం మహేశ్ ఉన్నారు.

ధాన్యం నిల్వకు గోదాములు సిద్ధం

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



పెద్దబోనాల సెంటర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లటౌన్: జిల్లాలో ధాన్యం నిల్వలను మిల్లుల వద్ద అన్‌లోడ్ చేయని పక్షంలో తాత్కాలిక గోదాముల్లోకి తరలించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు పోస్టర్లు ఆవిష్కరించి, సెంటర్లలో ఏర్పాట్లుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలన్నారు. ఇందుకోసం సిరిసిల్ల అపెరల్ పార్కులోని గోదాములను గుర్తించామని, మిల్లర్లు ధాన్యం దించుకోని పక్షంలో అక్కడకు చేరవేయాలని సూచించారు. రైసుమిల్లుల వద్ద ధాన్యం ఆరు గంటలకు మించి ఉండకూడదన్నారు. కొనుగోలు, తరలింపు చర్యల్లో అధికారులు బాధ్యతతో పనిచేయాలన్నారు. అనంతరం ధాన్యం సన్నరకానికి రూ.500 బోనస్ పోస్టర్లు ఆవిష్కరించారు. అంతకుముందు సిరిసిల్ల శివారులోని పెద్దబోనాల, చిన్నబోనాల, ముష్టిపల్లి, సర్దాపూర్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. పంటను మద్దతు ధరకు అమ్ముకోవాలని, దళారులకు అమ్ముకుని నష్టపోవద్దని సూచించారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, డీసీ ఎస్‌వో వసంతలక్ష్మి, డీఎం సివిల్ సప్లై రజిత, డీసీఓ రామకృష్ణ, డీఎం సీ మెప్మా రాజేశం, డీసీఎంఎస్ సెంటర్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజలకు రక్షణగా సీసీ కెమెరాలు

- ఎస్పీ అఖిల్ మహాజన్



వల్లంపట్ల గ్రామంలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఇల్లంతకుంట: గ్రామాల్లో ప్రజలకు రాత్రింబవళ్లు సీసీ కెమెరాలు రక్షణగా పనిచేస్తాయని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఇల్లంతకుంట మండలం మల్లంపట్ల గ్రామంలోని బస్టాండ్ ఆవరణలో మంగళవారం సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రైతు ఆళ్ల రాజిరెడ్డితో కలిసి సీసీ కెమెరాలు ప్రారంభించారు. ప్రజలందరూ కలసి ఏడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. గ్రామంలో ఏ చిన్న సంఘటన జరిగిన సీసీ కెమెరాల ద్వారా తెలుసుకోవచ్చు అని, ఎంతో భద్రత కల్పిస్తాయని, అనేక కేసులు ఛేదించడం జరిగిందని పేర్కొన్నారు. ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. కులం పంచాయితీ పేరుతో బహిష్కరణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, మధ్యవర్తులను ఆశ్రయించకూడదని పేర్కొన్నారు. గ్రామాల్లో గంజాయి, అసాంఘిక కార్యకలాపాలు ఉంటే సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పలు రికార్డులు పరిశీలించారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి కేసు నమోదు చేయాలని సూచించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ మొగిలి, ఇల్లంతకుంట ఎస్సై కే.శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో కేంద్ర బృందం పర్యటన



పనులు పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, రాగట్లపల్లి గ్రామాల్లో మంగళవారం కేంద్రబృందం సభ్యులు పర్యటించారు. ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర బృందం లీడర్ ఎస్పీ సునీల్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బృంద సభ్యురాలు స్నేహనజీబ్, ఏపీడీ నర్సింలు, ఐకేపీ డీపీఎం పద్మయ్య, ఈఈ శ్రీనివాస్, ఎంపీవో రాజు, ఏపీవో కొమురయ్య, ఏపీఎం మల్లేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి


నీలం అరుణ్


శివాజీ

రామడుగు: మండలంలోని షా నగర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకులు మృతిచెందినట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు . మండల కేంద్రానికి చెందిన సామంతుల శివాజీ (18) నీలం అరుణ్ (20) ద్విచక్రవాహనంపై వెదిర వైపు నుంచి రామడుగు గ్రామానికి వెళ్తున్నారు. షానగర్ గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న టాటాఎస్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి


సాగర్ మృతదేహం

జగిత్యాలక్రైం: జగిత్యాల కొత్త బస్టాండ్ సమీపంలో సాగర్ అనే వ్యక్తి మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి మృతిచెందాడు. బీర్పూర్ మండలం కొల్వాయి గ్రామానికి చెందిన బందెల సాగర్ (35) పదేళ్లుగా కొత్త బస్టాండ్‌సమీపంలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. నిత్యం మద్యం సేవిస్తున్నాడు. మంగళవారం ఉదయం అతిగా మద్యం సేవించి డ్రెయినేజీ పక్క నుంచి వెళ్తుండగా ప్రమాదవశాత్తు అందులో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బావ కుంబాల భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

చేప తగిలి యువకుడి మృతి

గొల్లపల్లి: మండలంలోని చెందోళికి చెందిన నారవేణి తిరుపతి(38) చేపల వేటకు వెళ్లగా.. అక్కడ చేప తగిలి గాయపడ్డాడు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. తిరుపతి తన మిత్రులతో కలిసి గ్రామంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఆ సమయంలో ఓ చేప వచ్చి తిరుపతి ఛాతి భాగంలో బలంగా తగిలింది. అతడిని స్నేహితులు, స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. తిరుపతి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య


దాసారపు శ్యాం

శంకరపట్నం: మండలంలోని మెట్పల్లిలో మంగళవారం ఉరేసుకొని దాసారపు శ్యాం(25) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దాసారపు ఎల్లయ్య–తిరుపతమ్మ చిన్న కుమారుడు శ్యాం కారు కొనుక్కొని హైదరాబాద్‌లో కొన్నేళ్లుగా అద్దెకు నడుపుతున్నాడు. పదిరోజుల క్రితం ఇంటికి వచ్చాడు. ఇటీవల అప్పులు ఉన్నాయని కుటుంబసభ్యులు, బంధువులకు తెలిపాడు. తల్లిదండ్రులు పనికి వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లోన్‌యాప్‌ల వేధింపులతోనే శ్యాం ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. ఈ విషయమై కేశవపట్నం ఎస్సై రవిని వివరాలు కోరగా ఫిర్యాదు అందలేదన్నారు.

ఇద్దరికి జైలు, జరిమానా

సిరిసిల్ల కల్చరల్: దొంగతనాలకు సంబంధించిన రెండు వేర్వేరు కేసుల్లో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్పీఅఖిల్ మహాజన్ తెలి పిన వివరాల ప్రకారం.. పట్టణంలోని జయనగర్‌కు చెందని పుదరి రాజు 2017 నవంబర్ 11న అంబికా నగర్‌లోని ఓ ఇంటి తాళం పగలగొట్టి రూ.97 వేల సామగ్రిని దొంగిలించాడు. ఇంటి యజమాని ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడుగురి సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల జరిమానా విధించింది. పట్టణంలోని శివనగర్‌కు చెందిన ఐలవేణి సుమన్ అలియాస్ అర్జున్ గంజాయికి అలవా టుపడ్డాడు. అవసరమైన వారికి అమ్మడానికి రవా ణా చేస్తుండగా పోలీసులు సాయినగర్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. అప్పటి సీఐ ఉపేందర్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ చె లుమల సందీప్ కేసు వాదించగా, తొమ్మిది మంది సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సుమన్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పిల్లలేం చూస్తున్నారో?

- సెల్‌ఫోన్ మైకంలో విద్యార్థులు, యువత
- 'నెట్'లో పడితే అంతే సంగతులు
- తల్లిదండ్రులూ.. నిఘా తప్పనిసరి
- నిర్లక్ష్యం చేస్తే అవమానాలు, అంతులేని శోకమే
- ఈ ఏడాది ఇప్పటివరకు కరీంనగర్ జిల్లాలో 71 సైబర్ క్రైం కేసులు



కరీంనగర్ క్రైం: కరోనా కారణంగా కాలు బయటపెట్టే వీల్లేకపోవడంతో పిల్లలు ఫోన్, కంప్యూటర్లలో ఆటలకు పరిమితమయ్యారు. అవి వారిలో హింసా ప్రవృత్తిని ప్రేరేపించాయి. క్రమంగా బెట్టింగ్‌కు అలవాటు పడేలా చేశాయి. ఇలా రూ.లక్షలు పోగొట్టుకున్నవారు ఉన్నారు. పరువు పోతుందని బయటకు రాని సంఘటలు ఎన్నో. గతంలో బ్లూవేల్ ఆటకు అలవాటు పడ్డ పిల్లలు ఆత్మహత్య చేసుకున్న ఘటనలూ ఉన్నాయి.

★ సోషల్ మీడియాతో చేటు



ఈ కాలపు యువత కాలక్షేపం అంతా సోషల్ మీడియాలోనే. నేరగాళ్లు వీటి మాటున చెలరేగుతున్నారు. ఫేస్‌బుక్ వేదికగా జరుగుతున్న మోసాలకూ అంతులేదు. అవతలి వ్యక్తి ఎవరో తెలియకుండా మొదలవుతున్న స్నేహం అనర్థాలకు దారితీస్తోంది. అమ్మాయిల ఫొటోలతో చాటింగ్ మొదలు పెడుతున్నవారు ఉచ్చు బిగించి, వేధింపులకు పాల్పడుతున్నారు.

★ మాల్‌వేర్ చొరబాటు..



అనేక అంశాలకు సంబంధించిన పుస్తకాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటున్నాయి. చదవాలనే ఆసక్తితో కొన్నింటిని తెరవగానే కంప్యూటర్లలోకి మాల్‌వేర్ చొరబడుతోంది. ఇది కంప్యూటర్ కార్యకలాపాలను నేరస్తులకు చేరవేయడమే కాదు.. బ్యాంకు ఖాతాల సమాచారాన్నీ చోరీ చేస్తుంది.

★ సైబర్ స్టాకింగ్..



ఆన్‌లైన్లో మారుపేరుతో స్నేహం చేస్తూ.. మహిళలను లైంగికంగా వేధించడమే సైబర్ స్టాకింగ్. ఈ తరహా నేరగాళ్లు మహిళల ఫోన్ నంబర్లు, ఈ–మెయిల్ ఐడీలు సేకరించి, ఇబ్బంది పెడతారు. విద్యార్థినులు, ఉద్యోగినులు దీని బారిన పడుతున్నారు.

★ సైబర్ టీజింగ్..



సూటిపోటి మాటలతో వేధించడం టీజింగ్. అదే ఆన్‌లైన్లో చేస్తే సైబర్ టీజింగ్. అనేక మంది ఇప్పుడు ఆన్‌లైన్లో దీన్నే ఫాలో అవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిలను రకరకాలుగా వేధిస్తున్నారు. తల్లిదండ్రులకు చెబితే ఏమనుకుంటారో అనే భయంతో వారు తమలో తామే కుమిలిపోతుంటారు.

★ క్యాట్ ఫిషింగ్..



మారుపేరుతో మోసానికి పాల్పడటం క్యాట్ ఫిషింగ్. ఈ తరహా నేరగాళ్లు మారుపేర్లు, ఫొటోలతో ఆన్‌లైన్ ప్రొఫైల్స్ పెట్టుకుంటారు. సామాజిక మాధ్యమాల ద్వారా కొంతకాలం స్నేహితులుగా నటిస్తారు. తర్వాత తమకు ప్రమాదం జరిగిందని, ఇంట్లో వాళ్లకు తీవ్ర అనారోగ్యం వచ్చిందని డబ్బు గుంజేందుకు ప్రయత్నిస్తుంటారు.

★ డాక్సింగ్..



ప్రముఖ వ్యక్తులు, సంస్థలను రకరకాలుగా వేధించడమే డాక్సింగ్. సంస్థలు, వ్యక్తుల కంప్యూటర్లలోకి చాటుగా చొరబడుతున్న నిందితులు కీలక సమాచారం తస్కరిస్తున్నారు. దాన్ని అంతర్జాలంలో పెడుతూ పరువు తీస్తున్నారు. అడిగినంత డబ్బు చెల్లించకపోతే ఇంకా ముఖ్యమైన సమాచారం బహిర్గతం చేస్తామని బెదిరిస్తారు.

★ సైబర్ బుల్లీయింగ్..



60 శాతం మంది యువత సైబర్ బుల్లీయింగ్ బారిన పడుతున్నారు. ఎదుటివారిని మానసికంగా దెబ్బతీ సేలా పోస్టులు పెడుతూ ఇబ్బంది పెడతారు.

★ స్వాటింగ్..



ఫలానా వ్యక్తి సంఘ విద్రోహశక్తి. అతని దగ్గర మారణాయుధాలో, మాదకద్రవ్యాలో ఉన్నాయని పోలీసులకు సమాచారమిచ్చి, ఇబ్బందులకు గురిచేయడమే స్వాటింగ్. గిట్టనివారిని లక్ష్యంగా చేసుకునే నేరమిది.

★ వీడియో చాట్‌తో మోసం



రకరకాల పద్ధతుల్లో ఫోన్ నంబర్లు సేకరిస్తున్న నేరగాళ్లు అందమైన అమ్మాయిలతో మాట్లాడిస్తున్నారు. కొద్దిగా పరిచయం కాగానే వీడియో కాల్‌లో చాటింగ్ చేద్దామని ముగ్గులోకి దింపుతారు. అందుకు సిద్ధమవగానే రెచ్చగొట్టేందుకు వీడియో కెమెరా ముందే నగ్నంగా మారిపోతారు. మాటలతో మభ్యపెట్టి, ఎదుటివారినీ నగ్నంగా మారాలంటూ కవ్విస్తారు. లొంగిపోతే.. ఇక అయిపోయినట్లే. ఆ వ్యవహారమంతా రికార్డు చేస్తారు. సంబంధిత ఫొటోలు, వీడియోలు బయట పెడతామంటూ బెదిరించి, డబ్బు గుంజుతారు.


చెడు తొందరగా ఆకర్షిస్తుంది



సెల్‌ఫోన్ ఎక్కువగా వాడుతున్న యువత పక్కదారి పడుతోంది. ఫోన్‌లో ఉన్న మంచి కంటే చెడే ఎక్కువగా ఆకర్షిస్తుంది. పిల్లల్లో చదువు, ఇతర విషయాలపై ఏకాగ్రత సన్నగిల్లుతుంది. ఫలితంగా ఆత్మ విశ్వాసం కోల్పోతూ కోపం, మానసిక ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతాయి. పోర్న్ వీడియోలకు బానిసలై, సంఘ విద్రోహ శక్తులుగా తయారవుతున్నారు.

– డాక్టర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి, సైకాలజిస్టు

నేర ప్రవృత్తి పెరుగుతోంది



పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు, వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు ఇవ్వాల్సి వస్తోంది. అయితే, వారు ఏం చూస్తున్నారని తల్లిదండ్రులు గమనిస్తుండాలి. పిల్లలు ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడి, తల్లిదండ్రుల అకౌంట్లలోని డబ్బులు పోగొడుతున్నారు. అశ్లీల చిత్రాలు, ఇతర వీడియోలతో నేర ప్రవృత్తి పెరిగి, పలు నేరాలు చేస్తున్నారు. కేసుల పాలవుతూ జైలుకు సైతం వెళ్తున్నారు.

– జి.నరేందర్, ఏసీపీ, కరీంనగర్ టౌన్

సెల్‌ఫోన్లే కారణం



పిల్లలు, యువత చెడుమార్గంలో పయనించడానికి ముఖ్య కారణం సెల్‌ఫోన్‌లే. ఆన్‌లైన్ క్లాసుల నెపంతో వివిధ లింకులు, వీడియోలు చూస్తూ మొబైల్‌కు బానిసలవుతున్నారు. చదువుపై ధ్యాస పెట్టకుండా, జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. కొందరు వీడియోలు చూస్తూ మద్యం, డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఫోన్ అవసరం తీరాక తల్లిదండ్రులు వెంటనే తీసుకోవాలి.

– ఎ.కిరణ్‌కుమార్, న్యాయవాది

అవగాహన కల్పించాలి



ఫోన్లను చదువు కోసం కాకుండా చెడిపోవడానికే ఎక్కువగా వాడుతున్నారు. తల్లిదండ్రులు పట్టించుకుంటే దీన్ని చాలావరకు నియంత్రించవచ్చు. స్కూళ్లు, కాలేజీల్లో సెల్‌ఫోన్లతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి. ఈ మధ్య ఆన్‌లైన్ గేమ్స్ ఆడి, డబ్బులు పోగొట్టుకోవడం, వివిధ నేరాలకు పాల్పడటం, చదువుకున్న యువత జల్సాల కోసం చోరీలు చేస్తుండటం బాధ కలిగిస్తోంది.

– శనిగరపు రవి, ప్రభుత్వ టీచర్

ఉద్యోగాల పేరిట మోసం.. నిందితుల అరెస్టు

సిరిసిల్ల క్రైం: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. కలెక్టరేట్లో డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని పలువురు దగ్గర డబ్బులు తీసుకున్న నిందితులను అరెస్టు చేసినట్లు వివరించారు. సీఐ వివరాల ప్రకారం.. నెల్లూరుకు చెందిన కాకర్ల భాను ప్రకాశ్ టిస్టా టెక్నాలజీస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానని సిరిసిల్లకు చెందిన రాపెల్లి విద్యాసాగర్ వద్ద రూ.2లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకపోగా.. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. బాధితుడి ఫిర్యాదుతో కాకర్ల భానుప్రకాశ్‌ను అరెస్టు చేశారు. సిరిసిల్ల కలెక్టర్‌లో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ జాబ్ ఇప్పిస్తానని మోసం చేసిన కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన కొండికొప్పుల శంకర్, వేల్పుల నగేశ్, శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. సిరిసిల్లలోని బీవై.నగర్‌కు చెందిన సాగల జీవన్‌కు సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని నిందితులు రూ.2లక్షలు, దానవీని సుప్రియ వద్ద రూ.1.70లక్షలు తీసుకుని మోసం చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు కొండికొప్పుల శంకర్‌ను అరెస్టు చేశారు. మిగితావారు పరారీలో ఉన్నట్లు సీఐ వెల్లడించారు.

నిధులు మంజూరు కాగానే నిర్మిస్తాం

ఎల్లారెడ్డిపేట: జిల్లాలోని అంగన్‌వాడీ భవనాలు నిధులు సరిపోకపోవడంతోనే నిర్మాణ పనులు నిలిచిపోయాయని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం తెలిపారు. మండలంలోని రాగట్లపల్లిలో నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనంపై 'సాక్షి'లో మంగళవారం కథనం ప్రచురితమైంది. భవన నిర్మాణాలను పూర్తిచేసేందుకు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే అంగన్‌వాడీ కేంద్రాల భవనాలను పూర్తి చేస్తామని తెలిపారు.

ఏడుగురికి గంజాయి పరీక్షలు

చందుర్తి (వేములవాడ): చందుర్తి సర్కిల్ పరిధిలోని గ్రామాల్లో అనుమానిత యువకులకు మంగళవారం గంజాయి పరీక్షలు నిర్వహించినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. గంజాయి సేవిస్తున్నారన్న అనుమానంతో వారికి పోలీసుస్టేషన్ ఆవరణలో పరీక్షలు నిర్వహించారు. నెగెటివ్ రావడంతో వారిని వదిలేసినట్లు సీఐ తెలిపారు.

రైతులకు సేవ.. ఉపాధికి తోవ

- సాగులో పెరిగిన ట్రాక్టర్ల వాడకం
- జిల్లాలో 12వేల వరకు ట్రాక్టర్లు
- నేడు ప్రపంచ ట్రాక్టర్ యజమానుల దినోత్సవం


ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

బోయినపల్లి(చొప్పదండి): రైతు లేనిదే రాజ్యం లేదు. ఇది ఒకప్పటి మాట. ట్రాక్టర్ లేనిదే రైతు లేడు. ఇది ప్రస్తుత సమాజంలో జరుగుతున్న తీరు. రైతు జీవితంలో ట్రాక్టర్ భాగమైంది. గతంలో ఎద్దులతో వ్యవసాయ పనులు చేపట్టేవారు. ట్రాక్టర్లు మార్కెట్‌లోకి ప్రవేశించాక రైతులతో పాటు వివిధ రకాల వ్యాపారులు ట్రాక్టర్ల వాడకం మొదలు పెట్టారు. ఏటా నవంబర్ 6వ తేదీన ప్రపంచ ట్రాక్టర్ యజమానుల దినోత్సవం నిర్వహిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అన్ని రకాల ట్రాక్టర్లు కలిపి 12వేల వరకు ఉన్నాయి.

రైతులకు అండగా ట్రాక్టర్లు

ట్రాక్టర్‌తో కొద్దిపాటి సమయంలో కొన్ని ఎకరాల మేర పొలం సాగుకు సిద్ధం చేస్తున్నారు. పత్తి, వరి తదితర చేలలో క్రిమిసంహారక మందుల పిచికారీకి సైతం వాడుతున్నారు. వరికోతలకు హార్వెస్టర్ వినియోగిస్తున్నారు. ఒక్కోగ్రామంలో 50 నుంచి 60వరకు ట్రాక్టర్లు ఉన్నాయి. ఫ్రంట్ బ్లేడ్, వరికోసే యంత్రాలు సైతం ఉన్నాయి. పొలం పనులే కాకుండా ట్రాక్టర్ వినియోగంతో మరెన్నో కమర్షియల్ పనులు చేస్తున్నారు. ఇంటి నిర్మాణానికి ఇసుక, కంకర, మొరం, ఇటుక తదితర ముడి సరుకుల రవాణకు ట్రాక్టర్ల వాడకం పెరిగింది.

ఇరవై ఏళ్లుగా ఉపాధి



నేను ఇరవై ఏళ్లుగా ట్రాక్టర్‌తో ఉపాధి పొందుతున్నా. 2004లో ట్రాక్టర్ కొనుగోలు చేశాను. సొంత పొలం పనులే కాకుండా చాలా మంది రైతులకు వ్యవసాయ పనులకు ట్రాక్టర్ వాడుతున్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ల వినియోగం లేనిదే ఏ పని జరగడం లేదు.

– రేండ్ల గంగరాజు, తడగొండ, బోయినపల్లి

డ్రైవర్ నుంచి యజమానిగా



మాది వ్యవసాయ కుటుంబం. చిన్నతనంలో ఉపాధికి ఇబ్బందిగా ఉండేది. డ్రైవింగ్ నేర్చుకుని ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేశాను. అనంతరం చాలా కష్టపడి ట్రాక్టర్ యజమానిని అయ్యాను. ట్రాక్టర్ మా కుటుంబానికి జీవనాధారమైంది. మొదటిసారిగా ట్రాక్టర్ల యజమానుల దినోత్సవం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– గోగూరి తిరుపతిరెడ్డి, తడగొండ, బోయినపల్లి

వరికోత మిషన్‌తో ఉపాధి



చిన్నతనంలో ట్రాక్టర్ ఫీల్డ్ అంటే ఇష్టంగా ఉండేది. కొద్ది రోజులు ట్రాక్టర్ డ్రైవర్‌గా చేశాను. ఇప్పుడు నాకు వరికోత మిషన్లు ఉన్నాయి. సీజన్‌లో మిషన్‌కు మంచి డిమాండ్ ఉంటుంది. వరికోత మిషన్ డ్రైవర్లకు ఉపాధి కల్పిస్తున్నా. రైతుల జీవితంలో ట్రాక్టర్ భాగం అయ్యింది. ట్రాక్టర్ మాకు ఉపాధి కల్పిస్తోంది.

– నల్ల మోహన్, బోయినపల్లి

విషాదం మిగిల్చిన రోడ్డు ప్రమాదం

- కారు, బైక్ ఢీకొని వ్యక్తి మృతి
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు


స్వామి(ఫైల్)

ధర్మారం(ధర్మపురి): పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లి బస్టాండ్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇదే గ్రామానికి చెందిన పెసరు స్వామి(46) దుర్మరణం చెందడం ఆ కుటుంబంలో తీవ్రవిషాదం నింపింది. ఇదే ఘటనలో మరో వ్యక్తి మిట్ట ఆశాలు తీవ్రంగా గాయపడ్డాడు. బంజేరుపల్లి నుంచి కటికెనపల్లికి స్వామి, ఆశాలు మోటారు సైకిల్‌పై వస్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు అతివేగంగా ఢీకొనడంతో పెసరు స్వామి అక్కడికక్కడే మరణించాడు. మిట్ట ఆశాలు కాలు విరిగింది. సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణ్ సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఆశాలును కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. స్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి పంపించారు.

ఆ కుటుంబానికి అన్నీ కష్టాలే..

నిరుపేద కుటుంబానికి చెందిన పెసరు స్వామి–స్వప్న దంపతులు. వీరికి కూతుళ్లు సింధూ, శివాణి ఉన్నారు. చిన్నకూతురు శివాణి ఇంజినీరింగ్ కోర్సు చదువుతోంది. పెద్దకూతురు సింధూకు నాలుగేళ్ల క్రితం వేములవాడ మండలం నూకలమర్రికి చెందిన సమీప బంధువు, వరుసకు మేనల్లుడు, ముంబాయిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కునాల్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక కుమారుడు జన్మించాడు. ఆ తర్వాత వీరి కాపురంలో కలతలు రావడంతో మనస్థాపానికి గురైన సింధూ ముంబాయిలోని తమ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుమారుడిని స్వామి దంపతులు తీసుకొచ్చి సంరక్షించుకుంటున్నారు. స్వామి ఫొటోగ్రాఫర్‌గా పనిచేసినా ఆశించిన ఆదాయం రాక కుటుంబ పో షణ భారంగా మారింది. దీంతో భార్య స్వప్నతో కలిసి గ్రామంలోనే టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. రెండేళ్లక్రితం పెద్ద కూతురు చనిపోవడం, ప్రస్తుతం భర్త స్వామి రోడ్డు ప్రమాదంలో మరణించడంతో స్వప్నతోపాటు కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తండ్రి మరణవార్త విన్న కూతురు శివాణి స్పృహతప్పి పడియింది. గ్రామస్తులు వెంటనే వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించారు.

రక్తహీనతపై అవగాహన


విద్యార్థినులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముస్తాబాద్: విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి అరుణ అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించి రక్తహీనతపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారంతోపాటు కూరగాయలు, పండ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్యులు అఖిల్, పవిత్ర, ప్రత్యేకాధికారి శ్రీలత, ఆశాకార్యకర్త రేణుక, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకు పోషించడం లేదని.. ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: కొడుకు పోషించడం లేదని జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన చల్లపల్లి గంగారాం (70) తీవ్ర మనస్తాపంతో మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై మన్మదరావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగారాం పేరున ఆస్తులున్నాయి. ఉన్న ఇంట్లోనే కొడుకు వేరుకాపురం పెట్టాడు. గంగారాం తన భార్య భాగ్యమ్మతో కలిసి నివసిస్తున్నాడు. గంగారాంను కొడుకు కొద్దిరోజులుగా పట్టించుకోవడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.





భక్తిగీతాలు.. కార్తీక దీపాలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఏఈవో శ్రావణ్ కుమార్, శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. శ్రీ మండప హనుమాన్ భజన మండలి వారి భజన కార్యక్రమం ఆకట్టుకుంది. అనంతరం ఆలయం ఆవరణలో వివిధ ఆకృతులతో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.





జైశ్రీరామ్.. జై హనుమాన్

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అంజన్నతోపాటు శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం చలి అధికంగా ఉండదంతో మధ్యాహ్న సమయంలో రద్దీ పెరిగింది. భక్తుల ఏర్పాట్లను లయ ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్, రాజేందర్ రెడ్డి, చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం। 16। నవంబర్। 2024



సిరిసిల్ల శివాలయంలో దీపార్చనలో పాల్గొన్న భక్తులు



రుద్రంగిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



కార్తీకదీపం మనసాస్మరామి

సిరిసిల్లటౌన్: కార్తీకపౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం సిరిసిల్లలోని ఆలయాల్లో మహిళలు దీపోత్సవం నిర్వహించారు. పట్టణంలోని శివాలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో పోటెత్తాయి. మహిళలు వెలిగించిన దీపాలతో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. శ్రీలక్ష్మీవేంకటేశ్వరాలయంలో తులసీకల్యాణం, రాత్రి 8గంటలకు పొన్నసేవా కార్యక్రమాలు నిర్వహించారు. శివనగర్ శ్రీరాజరాజేశ్వర ఆలయం, మున్సిపల్ సమీపంలోని విశ్వనాథ ఆలయం, పాతబజార్‌లోని పురాతన శివాలయాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో దీపారాధనలు చేశారు.



శివాలయంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



సత్యనారాయణవ్రతంలో మొక్కుతున్న మహిళలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

పురుగుమందుల విక్రయాలపై దృష్టి పెట్టాలి



చందుర్తి ఠాణాలో వ్యాపారులతో సమావేశమైన పోలీసులు

చందుర్తి(వేములవాడ): పురుగుల మందుల విక్రయాలపై దృష్టి పెట్టాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని మూలపల్లి, మల్యాల గ్రామాల్లో పలువురు పురుగుల మందు సేవించి ఆత్మహత్యలు చేసుకోవడంపై పోలీసులు స్పందించారు. మండలంలోని పురుగుమందుల దుకాణాదారులతో శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో సమావేశమయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పురుగుల మందు కొనుగోలుకు వచ్చిన వారికి భూములు ఉన్నాయా.. లేదా.. అనే విషయం తెలుసుకోవాలని సూచించారు. రైతులు కాని వారికి పురుగులమందుల విక్రయాలపై ఆలోచించాలన్నారు. కొంతమంది క్షణికావేశంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈనేపథ్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో బాపు, దుకాణాదారులు లింగాల మల్లయ్య, శ్రీకాంత్, హరిబాబు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న గురుస్వామి రాచ విద్యాసాగర్

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ధ్వజారోహణం నిర్వహించారు. గురుస్వామి రాచ విద్యాసాగర్ సారథ్యంలో ఈ కార్యక్రమం పూర్తి చేశారు. జనవరి 13 వరకు అయ్యప్ప మాల ధారులకు నిర్విరామంగా అన్నదానం కొనసాగుతుందని తెలిపారు. ఆలయ ధర్మకర్తలు కూన సురేశ్, దుబ్బ విశ్వనాథం, మడుపు లింగారెడ్డి, కల్లూరి రాజు, ఎర్రం శంకర్ బొప్ప దేవన్న, కొండి నారాయణ, అన్నల్‌దాస్ అనిల్, గడ్డం నాగరాజు పాల్గొన్నారు.

జోనల్ మీట్‌లో గురుకుల విద్యార్థినుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన నర్మాల విద్యార్థినులు

గంభీరావుపేట(సిరిసిల్ల): రాజన్నసిరిసిల్ల, మెదక్, కరీంనగర్ జిల్లా పరిధిలో నిర్వహించిన పదో జోనల్ మీట్ క్రీడాపోటీల్లో గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఖోఖో, కబడ్డీ, టెన్నికాయిట్, హైజంప్, షార్ట్‌పుట్, రన్నింగ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. ఓవరాల్ చాంపియన్‌షిప్ విజేతలుగా నిలిచారు. పాఠశాల హెచ్‌ఎం సృజన, పీడీ భారతి, పీఈటీ స్వర్ణలత విద్యార్థినులను అభినందించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- జీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్



మాట్లాడుతున్న సుభాష్

ముస్తాబాద్(సిరిసిల్ల): కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు, స్థానిక సంస్థల ఎన్నికలపై శుక్రవారం మండలాధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు. సుభాష్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని, రైతులకు పూర్తిస్థాయి రుణమాఫీ కాలేదన్నారు. పింఛన్ల పెంపుదలను కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని ఎద్దేవా చేశారు. ఓటు బ్యాంక్ రాజకీయాలు చేసే కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కొరెడ్ల మల్లారెడ్డి, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, సంతోష్‌రెడ్డి, బాధ నరేశ్, క్రాంతి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే వాతే..

- నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు
- జిల్లాలో నమోదైన కేసులు 7,561
- రూ.12,14,80,003 జరిమానాలు
- 68 మంది మందుబాబులకు జైలు
- పేట్రేగిపోతున్న మందుబాబులు
- ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్న పోలీసులు



డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పోలీసులు

సిరిసిల్లక్రైం: మద్యం తాగి వాహనాలు నడిపితే జిల్లా పోలీసులు వాత పెడుతున్నారు. భారీగా జరిమానాలు విధించడంతోపాటు కేసులు నమోదు చేస్తున్నారు. నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతూ మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలతోపాటు ట్రాఫిక్‌రూల్స్ నిబంధనలు పాటించని వారికి సైతం జరిమానాలు విధిస్తుండడంతో నిబంధనలు పాటించేలా చూస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన ట్రాఫిక్ జరిమానాలు లక్షల్లో ఉండగా కొందరికి డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన జైలు వరకు వెళ్లి వచ్చిన వారు ఉన్నారు. జిల్లాలో ఏడాదికాలంలో వివిధ కేసుల్లో రూ.12.14కోట్ల జరిమానాలు విధించారు.

తనిఖీలు ముమ్మరం.. మారని తీరు

హెల్మెట్ ధరించాలని పోలీస్ అధికారులు ఎన్ని అవగాహన సదస్సులు పెట్టినా ద్విచక్రవాహనదారుల తీరు మారడం లేదు. చిన్నపాటి ప్రమాదాల్లో హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ జిల్లా ఎస్పీ ఆదేశాలు ఇచ్చినా వాహనదారులు పాటించడం లేదు. సిరిసిల్ల పట్టణంలో పార్కింగ్ ప్లేస్‌లు లేకపోవడంతో వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారు తమ కార్లను నడిరోడ్డుపైనే నిలుపుతుండడంతో ట్రాఫిక్ కష్టాలు ఏర్పడుతున్నాయి. సిరిసిల్ల పెద్దబజార్, మున్సిపల్ ఏరియా, మార్కెట్ ఏరియాల్లోని దుకాణాల వద్ద ప్రత్యేకంగా పార్కింగ్ ప్లేస్ లేదు. వివిధ పనుల కోసం వచ్చిన వారు తమ కార్లను షాపుల ఎదుటే నిలుపుతుండడం ఇబ్బందిగా మారింది. ఈ విషయమై అనేకసార్లు ట్రాఫిక్ పోలీసులు, వాహనదారులకు మధ్య వాగ్వాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ట్రాఫిక్ ఎస్సై రాజు ఏకంగా తన కాలర్‌కు బ్యాటరీతో నడిచే సీసీ కెమెరాను ఏర్పాటు చేసుకుని విధులు నిర్వహిస్తున్నారంటే.. వాహనదారులను సరిచేయడంలో ఏ స్థాయిలో ఇబ్బందులున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఏడాదిలో వివరాలు ఇలా..	
డ్రంకెన్‌డ్రైవ్ కేసులు:	7,561
జరిమానాలు :	రూ.12.14 కోట్లు
ఒక రోజు జైలు శిక్ష పడిన వారు :	22
ఒక రోజుకు మించి శిక్ష పడిన వారు :	46

మద్యం సేవించిన వారికి బ్రీత్ అనలైజర్‌తో తనిఖీలు చేస్తున్నారు. 36 పాయింట్లు వస్తే జరిమానాలు విధించి కోర్టులో హాజరుపరుస్తున్నారు.

అలంకారప్రాయంగా ట్రాఫిక్ ఐలాండ్స్

ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు వేములవాడ, సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐలాండ్స్ అలంకారప్రాయంగా మారాయనే విమర్శలు ఉన్నాయి. వేములవాడలోని ట్రాఫిక్ ఐలాంట్ చెప్పుల స్టాండ్‌గా మారగా, సిరిసిల్ల పాతబస్టాండ్ ఏరియాలో ఏర్పాటు చేసిన కేంద్రం ప్రకటనల కోసం పెట్టినట్లుగా మారిందనే విమర్శలు ఉన్నాయి. ఆ ఐలాండ్ నుంచే స్థానిక పండ్ల వ్యాపారులు విద్యుత్ కనెక్షన్ తీసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. రోడ్డుపైనే పండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నా పోలీసులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్, పోలీస్ శాఖ సంయుక్తంగా సిరిసిల్లలో పార్కింగ్‌ప్లేస్‌లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

స్వీయ రక్షణ కోసమే..



డ్రంకెన్‌డ్రైవ్, వాహనదారులను వాహన ధ్రువీకరణపత్రాలు అడిగితే అనేకసార్లు వాగ్వాదాలు జరిగాయి. వాహనదారుల మంచి కోసమే నిబంధనలు కఠినంగా అమలు చేస్తాం. ఈక్రమంలోనే గొడవలు చేసేవాళ్లు ఉన్నారు. అలాంటి వారి ఆగడాలకు చెక్ పెట్టేందుకు డ్యూటీలో ఉండగా సీసీ కెమెరా ధరిస్తాను. నిబంధనలు పాటిస్తే వాహనదారులకు మేలు.

– రాజు, ట్రాఫిక్ ఎస్సై, వేములవాడ

నిత్యం డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు



మద్యం మత్తులో బైక్, కార్లు నడిపి ప్రమాదాలకు గురికావద్దు. ఇలాంటి ప్రమాదాల్లో ప్రాణాలు పోయి అనేక కుటుంబాల్లో విషాదాలు ఉన్నాయి. ప్రమాదాల నివారణకే ప్రతీ స్టేషన్ పరిధిలో డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ



కొలువు కల.. నెరవేరిన వేళ

ప్రభుత్వ ఉద్యోగం వారి కల.. దానికోసం ఏళ్లుగా కష్టపడ్డారు.. చివరికి అనుకున్నది సాధించారు.. అందరివి వ్యవసాయ, బీడీ, గీత కార్మిక, పవర్‌లూమ్, నిత్య కూలీ కుటుంబాలే.. అయినా, అవేవీ వారి లక్ష్యాన్ని అడ్డుకోలేకపోయాయి.. గ్రూప్–4 నోటిఫికేషన్ వచ్చి, పరీక్ష నిర్వహణ, ఫలితాలకు రెండేళ్ల సమయం పట్టినా విసుగు చెందలేదు.. ప్రతీరోజు సన్నద్ధమై, అనుకున్నది సాధించారు. వివిధ శాఖల్లో జూనియర్ అసిస్టెంట్లుగా ఎంపికై, తమ కుటుంబాల్లో సంతోషం నింపారు. పిల్లల విజయాన్ని చూసిన తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేవు. 10లో▸

సిరిసిల్ల లైబ్రరీలో చదివాను



సిరిసిల్లఎడ్యుకేషన్: మా అమ్మా–నాన్న సత్యనారాయణ–సుశీల. నాన్న పవర్‌లూమ్ కార్మికుడు. 12 ఏళ్ల క్రితం చనిపోయాడు. అమ్మ బీడీ కార్మికురాలు. నేను డిగ్రీ పూర్తి చేసి, పోటీ పరీక్షల కోసం సిరిసిల్ల లైబ్రరీలో చదువుకున్నాను. స్నేహితుల ప్రోత్సాహంతోనే నేను గ్రూప్–4 ఉద్యోగం సాధించాను. ఇదివరకు ఓ ప్రైవేట్ పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేశాను.

– కాముని శరత్‌బాబు, సిరిసిల్ల

కూలీ కుటుంబం నుంచి..



కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన దర్శనాల హరీశ్ గ్రూప్–4 ఉద్యోగం సాధించాడు. అతని తల్లిదండ్రులు స్వరూప–రాజయ్య కూలీ పనులకు వెళ్తున్నారు. స్థానిక అబ్దుల్ కలాం స్టడీ హౌస్‌లో మిత్రులతో కలిసి గ్రూప్ స్టడీ చేయడం వల్లే తాను ఉద్యోగం సాధించానని హరీశ్ తెలిపాడు. గ్రూప్–1 సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

గ్రూప్–3 పరీక్షకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ అఖిల్ మహాజన్



సిరిసిల్లక్రైం: ఈనెల 17, 18 తేదీల్లో జరిగే గ్రూప్–3 పరీక్షలకు పకడ్బందీగా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాల్లో 7,062 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, కేంద్రాల వద్ద సెక్షన్ 163 బీఎన్‌ఎస్‌ఎస్ అమలు చేయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్స్ మూసివేయాలని సూచించారు. పరీక్షసెంటర్స్ నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

ఐఎంఏ మహిళా అధ్యక్షురాలిగా లీలా శిరీష



సిరిసిల్లటౌన్: ఐఎంఏ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా సిరిసిల్లకు చెందిన డాక్టర్ లీలాశిరీష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెకు ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ అభినయ్, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కిషన్, జిల్లా వైద్యాధికారి వసంతరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి పెంచలయ్య, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణ, వైద్యులు సత్యనారాయణ, శంకర్, రమణారావు, శోభారాణి, గీతావాణి, అరుణ, రవీంద్ర, తిరుపతి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి ఎక్కడా ఆగదు



గ్రంథాలయ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

- నేతన్నలకు అండగా ఉంటాం
- బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ ప్రమాణ స్వీకారం

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల ప్రాంతంలో అభివృద్ధి ఎక్కడా ఆగదని.. మరింత పురోభివృద్ధి సాధిస్తుందని బీసీ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్ ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం నిర్వహించగా.. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడారు. నేతన్నల కోసం పదేళ్ల క్రితం ఆత్మస్థైర్య ర్యాలీ నిర్వహించామని... ఇప్పుడు ఆత్మహత్యల నివారణకు మళ్లీ ర్యాలీ చేపడతామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అణచివేత అనుభవించామని ఇప్పుడు అసలైన ప్రజాపాలనను కాంగ్రెస్ అందిస్తుందని పేర్కొన్నారు. గతంలో ప్రతిపక్షాలను అరెస్టు చేశారని, ఇప్పుడు నిరసన తెలుపుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా గ్రంథాలయానికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పదవులు వస్తాయన్నారు.

ప్రభుత్వ బకాయిలు చెల్లిస్తున్నాం

గత ప్రభుత్వం పెట్టిన బతుకమ్మ చీరల బకాయిల్లో రూ.203కోట్లు తమ సర్కారు ఇచ్చిందని మరో రూ.40కోట్లు కూడా ఇస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. వీటీడీఏకు సీఎం చైర్మన్‌గా ఉన్నారు కాబట్టే పాలకవర్గం వేయడం లేదన్నారు. ఈనెల 20 వేములవాడకు సీఎం వస్తున్నారని అక్కడ అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేస్తారన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర గ్రంథాలయసంస్థ చైర్మన్ రియాజ్, సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, పార్లమెంటు ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, సీనియర్ నాయకులు సంగీతం శ్రీనివాస్, కటుకం మృత్యుంజయం, ఆకునూరి బాలరాజు, ఏఎంసీ చైర్మన్ వెల్ముల స్వరూపరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాయకులు సూర దేవరాజు, కాముని వనిత, మ్యాన ప్రసాద్, గోలి వెంకటరమణ, ఆడెపు చంద్రకళ, కల్లూరి చందన, నర్సయ్య పాల్గొన్నారు.

20న సీఎం పర్యటన

సిరిసిల్లకల్చరల్: సీఎం రేవంత్‌రెడ్డి ఈనెల 20న వేములవాడను సందర్శించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. దేశానికే దిక్సూచిలా పనిచేసేలా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే విషయంలో సందేహాలు పెట్టుకోవద్దని ప్రజలు సహకరించాలని కోరారు. సన్నధాన్యం కొనుగోళ్లకు ఆటంకాలు లేకుండా చూడాలని, మిల్లర్లు సహకరించకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. సమీకృత గురుకుల భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. మధ్యమానేరు నిర్వాసితుల కోసం 10,600 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయాలని విప్ ఆది శ్రీనివాస్ కోరారు.

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



వేములవాడఅర్బన్: వేములవాడలో ఈనెల 20న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో చేయాల్సిన ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ శుక్రవారం రాత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. సీఎం పర్యటించే ప్రాంతాలు, ప్రారంభోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. స్వామి వారి మహాపూజలో పాల్గొన్నారు. రాత్రి వేములవాడలోనే బస చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పెద్ద పీట

సిరిసిల్లక్రైం: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ పేర్కొన్నారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన 46 సీసీ కెమెరాలు కలెక్టరేట్ ఆవరణలో ప్రారంభించారు. జిల్లాలోని ప్రధాన రహదారులు బోయినపల్లి–జిల్లెల్ల, రుద్రంగి–వేములవాడ వరకు పైలెట్ ప్రాజెక్టుగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ తెలిపారు. త్వరలోనే ఎల్లారెడ్డిపేట నుంచి గంభీరావుపేట మండలం పెద్దమ్మ చెక్‌పోస్ట్ వరకు సీసీ కెమెరాల ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళీకృష్ణ, వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ వీరప్రసాద్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్లకల్చరల్: గిరిజన సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను సద్వి నియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గిరి జన ఉద్యమ నాయకుడు బిర్సా ముండా 150వ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. బిర్సా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. దేశంలోని 63,843 గిరిజన గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం రూ.79,156 కోట్లతో వసతుల కల్పన కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఖేలో ఇండియా జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన గిరిజన విద్యార్థిని మలావత్ సౌందర్యను కలెక్టర్ అభినందించారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభచాటిన విద్యార్థులను ప్రశంసించారు. గిరిజన సంక్షేమాధికారి జనార్దన్ ఉన్నారు.



సౌందర్యను సన్మానిస్తున్న అధికారులు